

కౌండిన్యలో గజ గణన

- నేటి నుంచి 3 రోజుల పాటు సర్వే

కౌండిన్య అభయారణ్యంలో ఏనుగులు ఎన్ని ఉన్నాయనేది అటవీ శాఖ గణన చేపట్టనుంది. గురువారం నుంచి మూడు రోజుల పాటు అధికారులు సర్వే ద్వారా ఏనుగులను లెక్కించనున్నారు. దేశ వ్యాప్తంగా పదేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ సర్వేను చివరిగా 2017లో చేపట్టారు. ఏనుగుల సంతతి పెరుగుతున్న క్రమంలో గతేడాది మేనెల 17 నుంచి 19వ తేదీ వరకు గణన చేపట్టారు. ఇక, దక్షిణాది రాష్ట్రాల్లో చేపట్టే సర్వే జాబితాలో మన జిల్లాలోని పశ్చిమ విభాగంలో ఉన్న కౌండిన్య అభయారణ్యంకు స్థానం లభించింది. జిల్లాలోని కౌండిన్య అభయారణ్యంతో పాటు కర్ణాటక, తమిళనాడు సరిహద్దు అటవీ ప్రాంతాల్లో ఏకకాలంలో గజ గణన చేపట్టనున్నారు.

- చిత్తూరు (సెంట్రల్)



బంగారుపాళ్యం మండలం మొగిలివారిపల్లె వద్ద సంచరిస్తున్న ఏనుగుల గుంపు (ఫైల్ ఫొటో)

సర్వే చేసేదిలా..

గతేడాది జిల్లా అటవీ విభాగంలోని 83 బీట్లలో 41 బీట్లలో ఏనుగుల సంచారం ఉంది. వీటిలో 37 బీట్లలో సర్వే చేపట్టారు. ఏడాది కాలంలో ఏనుగల సంచారం అధికం కారణంగా 50 నుంచి 60 బీట్లలో ఏనుగుల గణన చేపట్టనున్నారు. తొలి రోజున అటవీ సిబ్బంది మొత్తం 15 నుంచి 20 కిలోమీటర్ల పరిధిలో జిగ్‌జాగ్ విధానంలో ఏనుగుల సర్వే చేపడతారు. రెండో రోజున నిటారు (స్ట్రైట్) లైన్ సర్వేలో ఏనుగుల పాద ముద్రలు, లద్దెల ఆధారంగా సర్వే ఉంటుంది. మూడో రోజున నీటి కోసం ఏనుగులు వచ్చే కుంటల వద్ద ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కాపుకాసి సర్వే చేస్తారు. ఏనుగుల ఫొటోలు తీయడం, అవయవాల ద్వారా గుర్తించడం, లింగ నిర్ధారణ వంటి ప్రమాణాలు పాటించనున్నారు.

ఏనుగుల సంఖ్య పెరిగే అవకాశం

నాలుగేళ్ల కిందట కౌండిన్య అభయారణ్యంతో పాటు కర్ణాటక, తమిళనాడు సరిహద్దు అటవీ ప్రాంతాల్లో కేవలం 45 ఏనుగులు సంచరించేవి. గతేడాది వీటి సంఖ్య 90కి పైగా చేరింది. ఈ ఏడాదిగా జిల్లాలోని అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ఏనుగులు సంచరిస్తున్న తీరు, పంట పొలాలు, గ్రామీణులపై దాడులు, రాత్రివేళ ఘీంకారాలు, గుంపులు గుంపులుగా ఏనులుగు రావడం.. వీటన్నింటిని పరిశీలిస్తే వీటి సంఖ్య మరింత పెరిగి ఉంటుందని అటవీ శాఖ అధికారుల అంచనా. ప్రస్తుతం ఈ ఏనుగుల సంఖ్య 120కి చేరి ఉండొచ్చని భావిస్తున్నారు. వీటిలో ఎన్ని తరచూ సరిహద్దు రాష్ట్రాల్లోని అడవుల్లో సంచరిస్తున్నాయనేది లెక్కలు తేలాల్సి ఉంది.

పక్కాగా లెక్కలు కడతాం



తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లోని కౌండిన్య అభయారణ్యంలో అన్ని వైపులా ఏనుగుల సంచారం ఉంటుంది. అందుకని ఇక్కడ గజ గణనపై దృష్టి పెట్టాం. అభయారణ్యంలో ఎన్ని ఏనుగులు ఉంటాయనేది పక్కాగా లెక్క తేల్చనున్నాం. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల అటవీ శాఖ అధికారులు కూడా వారి వారి సరిహద్దుల్లో ఏకకాలంలో ఏనుగుల గణన చేపట్టనున్నారు.

- చైతన్యకుమార్‌రెడ్డి, డీఎఫ్‌వో



సీసీ కెమెరాలో రికార్డయిన దాడి దృశ్యం



చికిత్స పొందుతున్న కౌన్సిలర్ సెల్వం, అశోక్

టీడీపీ కౌన్సిలర్‌పై వైసీపీ దాడి

- అభివృద్ధి చేయలేదంటూ వితండవాదం

కుప్పం, మే 22: అభివృద్ధి పనులు చేయాల్సిన బాధ్యత అధికార పార్టీ ప్రజా ప్రతినిధులపై ఉంటుంది. ఎక్కడైనా ఒకరిద్దరు ప్రతిపక్షాలకు చెందిన ప్రజాప్రతినిధులుండీ.. వారు అభివృద్ధి చేయాలన్నా వీలుకాని పరిస్థితులు ఉంటాయి. కానీ కుప్పంలో పరిస్థితి తిరగబడింది. వార్డును ఎందుకు అభివృద్ధి చేయలేదంటూ వైసీపీకి చెందిన కార్యకర్తలు, టీడీపీకి చెందిన కౌన్సిలర్‌పై దాడికి తెగబడ్డారు. ఈ ఈ ఘటనలో తంబిగానిపల్లెకు చెందిన 5వ వార్డు కౌన్సిలరు సెల్వంతోపాటు ఆ పార్టీ మాజీ వార్డు సభ్యుడు అశోక్ గాయపడ్డారు. బాధితులు తెలిపిన ప్రకారం.. తంబిగానిపల్లెలో బుధవారం అశోక్‌తో కలిసి టీడీపీ కౌన్సిలర్ సెల్వం వెళ్తున్నారు. నలుగురు వైసీపీ కార్యకర్తలు వీరికి అడ్డు వచ్చారు. వార్డులో రోడ్లు ఎందుకు వేయడంలేదని నిలదీశారు. సెల్వం గెలిచాక ఒక్క పనీ జరగలేదని వాదనకు దిగారు. అటు రాష్ట్రంలోను, ఇటు మున్సిపాలిటీలోనూ వైసీపీనే అధికారంలో ఉందని, అభివృద్ధి చేయాల్సింది మీరేనంటూ కౌన్సిలర్ సెల్వం వారికి దీటుగా సమాధానమిచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో వార్డులో ఒక్క పనీ జరగకపోవడం తనకు బాధగానే ఉందని, మీవారికి చెప్పి అభివృద్ధి పనులు చేయించాల్సిన బాధ్యత మీపైనే ఉన్నదని రిటార్టు ఇచ్చారు. దీంతో రెచ్చిపోయిన వైసీపీ కార్యకర్తలు దాడికి దిగారు. పక్కనే ఉన్న దుకాణంలోకి వెళ్లినా.. వెంటపడి మరీ దాడి చేశారు. అడ్డం వచ్చిన అశోక్‌నూ కొట్టారు. ఈ ఘటనలో గాయపడిన కౌన్సిలరు సెల్వం, అశోక్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దాడిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- ముందు పోస్టల్ బ్యాలెట్

ఆ తర్వాత ఈవీఎం ఓట్ల లెక్కింపు

- కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదు
- అబ్జర్వర్ల సంతకం తర్వాతే రౌండ్లవారీ ఫలితాల వెల్లడి



చిత్తూరులోని ఎస్వీ సెట్ కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ తదితరులు (ఫైల్ ఫొటో)

చిత్తూరు కలెక్టరేట్, మే 22: జిల్లాకు సంబంధించి చిత్తూరులోని ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాలలో జూన్ 4వ తేది ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. పోస్టల్ బ్యాలెట్‌ను పూర్తిస్థాయిలో కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు పరిశీలిస్తారు. పోస్టల్ బ్యాలెట్ వేసిన వారి సంతకం లేదా వేలిముద్ర ఉందా లేదా చూస్తారు. గతంలో అరగంట వ్యవధిలోనే పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యేది. ఈసారి పోస్టల్ బ్యాలెట్ల సంఖ్య పెరిగింది. జిల్లాలో 11,150 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. ఇక, 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, మంచాలకే పరిమితమైన దివ్యాంగులకు కూడా తొలిసారి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించారు. వీటి లెక్కింపు ముగిశాక.. ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. నియోజకవర్గంలోని పోలింగ్ శాతాన్ని బట్టి రౌండ్లు కేటాయిస్తారు. సాధారణంగా నియోజకవర్గ ఓట్ల లెక్కింపును 14 రౌండ్లుగా విభజించి లెక్కిస్తారు. ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదటి దశలో కొంత జాప్యం జరుగుతుంది. ఆ తర్వాత నుంచి త్వరితగతిన సాగుతుంది. టేబుళ్ల వారీగా అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు జరుగుతున్నప్పటికీ.. దానికి అనుసంధానంగా మరో కౌంటింగ్ కేంద్రంలో లోక్‌సభ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు జరుగుతుంది. గుర్తింపు కార్డు కలిగిన వారినే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతిస్తారు. కౌంటింగ్ సెంటర్‌లో ప్రతి నియోజకవర్గానికి మూడు టేబుళ్లు ఏర్పాటు చేసి, సిబ్బందికి విధులు కేటాయింపునకు మూడు ర్యాండమైజేషన్లు నిర్వహిస్తారు. మూడో ర్యాండమైజేషన్‌లో టేబుళ్ల వారీగా సిబ్బందిని ఖరారుచేస్తారు. వీరిలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు ఉంటారు. వీరందరికీ ముందస్తుగా గుర్తింపు కార్డులు జారీచేస్తారు. కౌంటింగ్ కేంద్రంలో ప్రవేశించినవారికి సెల్‌ఫోన్ అనుమతి ఉండదు. అక్కడి కౌంటర్లలో సెల్‌ఫోన్లను డిపాజిట్ చేయాలి. ప్రతి రౌండ్‌కు లెక్కింపు వివరాలను డిస్‌ప్లే బోర్డులో ప్రదర్శించడంతో పాటు ఆ వివరాలను ఎన్‌కోర్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు.

కౌంటింగ్ ప్రక్రియ వీడియోగ్రఫీ

సీసీ కెమెరాల నిఘాలో కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుంది. ఒక్కో కౌంటింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 14మంది ఏజెంట్లను అనుమతిస్తారు. ఫారం-17సీలో నమోదుచేసిన ఓట్లను ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్ల సంఖ్యతో సరిచూస్తారు. అవి సరిగ్గా ఉన్నట్లు ధ్రువీకరించిన తర్వాత అభ్యర్థుల ఏజెంట్ల దగ్గర సంతకం తీసుకుంటారు. అనంతరం ఈవీఎంల సీల్ తొలగించి, రిజల్ట్ బటన్ నొక్కుతారు. ఈవీఎంలో పోలైన ఓట్లలో ఎవరెవరికి ఎన్ని ఓట్లు పడ్డాయనే విషయం తెలుస్తుంది. ఒక్కో రౌండ్‌లో ఏయే అభ్యర్థికి ఎన్నేసి ఓట్లు వచ్చాయనే వివరాలను కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన బోర్డుపై సిబ్బంది రాస్తారు. ఈ ప్రక్రియను పూర్తిగా వీడియో తీసి భద్రపరుస్తారు. అనంతరం ఈ ఫుటేజ్‌ను భద్రపరిచి ఎన్నికల కమిషన్‌కు పంపిస్తారు.

కౌంటింగ్‌కు 1400 మంది నియామకం

ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 200 మంది చొప్పున ఏడింటికి 1400 మంది ఉద్యోగులను నియమిస్తారు. వీరు ఏకకాలంలో అసెంబ్లీతో పాటు పార్లమెంటు ఓట్లను ఈవీఎంల ద్వారా లెక్కిస్తారు.ఎన్నికల నియమావళి ప్రకా రం ప్రతి రౌండ్‌లో ఫలితాలను ఎన్నికల అబ్జర్వర్లు సంతకం పెట్టి న తర్వాతే వెల్లడిస్తారు. ఆయా నియోజకవర్గాల ఆర్వోలు ఓట్ల లెక్కింపును పర్యవేక్షిస్తారు. తుది రౌండ్ పూర్తయిన తర్వాత అభ్యర్థులవారీగా ఫలితాలను ఆర్వోలు అధికార పూర్వకంగా ప్రకటిస్తారు.

కరుణించమ్మా.. గంగమ్మా

చిత్తూరులో భక్తిశ్రద్ధలతో అమ్మవారి నిమజ్జనం

చిత్తూరు కల్చరల్, మే 22: చిత్తూరులో రెండు రోజులుగా జరిగిన నడివీధి గంగమ్మ జాతర బుధవారం నిమజ్జన కార్యక్రమంతో ముగిసింది. మంగళవారం వేకువజామున వంశపారంపర్య ధర్మకర్త సీకేబాబు తొలిపూజతో జాతర ప్రారంభమైంది. రెండు రోజులపాటు చిత్తూరు నగరం, చుట్టుపక్కల మండలాల ప్రజలు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచీ పెద్ద సంఖ్యలో భక్తులు గంగమ్మను దర్శించుకున్నారు. బుధవారం సాయంత్రం వంశపారంపర్య ధర్మకర్త సీకేబాబు, సీకే లావణ్య దంపతులు, కుమారుడు సీకే సాయి కృష్ణారెడ్డి పొన్నియమ్మన్ ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేలాది భక్తులతో కలిసి అమ్మవారి సారెను ఊరేగింపుగా తీసుకొచ్చి నడివీధి గంగమ్మకు సమర్పించారు. మంగళహారతి ఇచ్చాక గంగమ్మ నిమజ్జన ఊరేగింపు మొదలైంది. బజారు వీధి, శేషాపిరాన్ వీధి మీదుగా పాత చందనా రమేష్ షాపింగ్ మాల్ వరకు సాగింది. అక్కడ అమ్మవారికి ఓంశక్తి బృందం కొక్కీలు తగిలించుకుని పూలమాలను సమర్పించారు. అక్కడ్నుంచి కోర్టు మీదుగా రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద ఉన్న నిమజ్జన ప్రాంతానికి అమ్మవారిని తీసుకెళ్లి పూజలు చేశారు. అనంతరం నిమజ్జనం కార్యక్రమ తంతు ముగించారు.

ఆకట్టుకున్న ఓంశక్తి భక్తుల విన్యాసాలు

గంగజాతరలో ఓం శక్తి భక్తుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సుమారు 800 మంది ఓం శక్తి భక్తులు కొక్కీలు తగిలించుకుని లారీలు, ఆటోలు, మినీ వ్యాన్లను లాగారు. మరికొంత మంది మహిళలు, యువకులు, పిల్లలు నోటికి శూలాలు గుచ్చుకుని ఒళ్లు గగుర్పొడిచేలా విన్యాసాలు చేస్తూ ఓంశక్తి నామస్మరణలతో పురవీధులు ఊరేగింపు చేశారు. ఈశ్వరుడి గుడి వద్ద శూలాలు గుచ్చుకుని ఆస్పత్రి రోడ్డు, చర్చివీధి, పీసీఆర్ సర్కిల్ మీదుగా పాత చందనా రమేష్ షాపింగ్ మాల్ వద్దకు చేరుకున్నారు. అక్కడ వీపులకు కొక్కీలు తగిలించుకుని వేలాడుతూ ఓ భక్తుడు అమ్మవారికి పూలమాలను వేయడంతో జాతర తంతు ముగిసింది.





రెండో రోజు గంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు - నిమజ్జన ఊరేగింపులో క్రేన్‌కు వేలాడుతూ అమ్మవారికి పూలమాలలు వేస్తున్న ఓం శక్తి భక్తుడు



గంగమ్మ నిమజ్జనానికి ఊరేగింపుగా సారె తీసుకొస్తున్న సీకే బాబు కుటుంబీకులు











ఉగ్రరూపం.. కారుణ్య దైవం!

- వైభవంగా కుప్పం గంగమ్మ విశ్వరూప దర్శనం

కుప్పం, మే 22: పొంగళ్లు.. పొర్లు దండాలు.. జైజై నినాదాలు.. నానావిధ వేషాలు.. పొంగిపొర్లే భక్తిభావాలు.. భావావేశంతో పులకరించే భక్త దేహాలు.. కుప్పం గంగమ్మ విశ్వరూప దర్శనవేళ భక్తి పరవళ్లు తొక్కింది. మూడు రాష్ట్రాల నుంచి పోటెత్తిన భక్తజనంతో పట్టణం కిక్కిరిసింది. వీధివీధినా గంగజాతర కోలాహలం నెలకొంది.

కుప్పంలోని ప్రసన్న తిరుపతి గంగమాంబ విశ్వరూప దర్శనం బుధవారం భక్తుల కన్నుల పండువగా జరిగింది. మంగళవారం ఉదయంనుంచి బుధవారం ఉదయం దాకా అమ్మవారి ఖండిత శిరస్సు ఊరేగింపు పట్టణ వీధులలో విరామమెరుగకుండా సాగింది. ఎక్కడికక్కడ భక్తుల ఇళ్ల ముంగిళ్లలో నిలిచి వారిచ్చే కర్పూర హారతులు, నైవేద్యాలు, బలులు స్వీకరించి అమ్మవారు ముందుకు సాగారు. చివరకు బుధవారం ఉదయం 11 గంటలకు ఆలయానికి చేరుకుంది. అక్కడ సిద్ధంగా ఎదురు చూస్తున్న శేష దేహంపై అమ్మవారి శిరస్సును పూజారులు అమర్చారు. దీంతో ప్రసన్న తిరుపతి గంగమాంబకు సంపూర్ణ రూపం ఏర్పడింది. సర్వాభరణాలు, నానావిధ పుష్పమాలికలతో అమ్మవారిని అలంకరించిన తర్వాత భక్తులను దర్శనానికి అనుమతించారు. అప్పటికే క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు గంగమ్మ విశ్వరూప దర్శనం చేసుకోవడానికి పోటెత్తారు. ఉదయంనుంచి అర్ధరాత్రి దాకా అలా క్యూలైన్లు నిండుతూనే ఉన్నాయి. మూడు రాష్ట్రాలనుంచి భక్తజనం వేలాదిగా తరలి వచ్చి అమ్మవారి దర్శనం చేసుకుని తరించింది. బలిపీఠం వద్ద జంతు బలులతోపాటు కర్పూర నీరాజనాలు, కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నానావిధ వేషాలతో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. గంగ జాతర సందర్భంగా కుప్పంలో పండుగ వాతావరణం ఏర్పడింది. ఎటుచూసినా భక్తజనం పరవళ్లు తొక్కింది. ఒక్క కుప్పం పట్టణమే కాదు, నియోజకవర్గంలోని నాలుగు మండలాలలోని ప్రతి ఇల్లూ, పొరుగు రాష్ట్రాలనుంచీ జాతరకు వచ్చిన బంధుమిత్రులతో నిండిపోయింది. అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మాంసాహార వంటకాలతో వారికి విందు భోజనాలు పెట్టి, ఆనందపరిచారు స్థానికులు. గంగమ్మ విశ్వరూప దర్శనవేళ కులమత బాషా భేదము లేకుండా సర్వజనులూ అమ్మను కొలిచి తరించారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఈసారి బాణసంచా పేలుళ్లను రద్దు చేశారు. మిగిలిన ఉత్సవాలన్నీ అమ్మవారికి యథాతథంగా జరిగాయి.



గంగమ్మను దర్శించుకోవడానికి క్యూలైన్లలో కిక్కిరిసిన భక్తులు





పోలీసులూ.. ఇదేమి తీరు!

- చిత్తూరు జాతరలో అడుగడుగునా ఆంక్షలు
- గుండెపోటు వచ్చినా ట్రాఫిక్ క్లియర్ చేయని వైనం
- ఆస్పత్రి వద్ద ఆటోను ఆపి.. పంపడంతో మరింత ఆలస్యం
- అప్పటికే మృతిచెందిన భక్తుడు





ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు - గుండెపోటు వచ్చిన వ్యక్తిని ఆటోలో తీసుకెళుతున్న స్థానికులు - స్ట్రెచర్‌పై తీసుకెళుతున్న బంధువులు

చిత్తూరు, మే 22: పోలీసులు ఏమాత్రం మానవీయ కోణాన్ని చూపలేదు. గంగమ్మ దర్శనానికి వచ్చిన భక్తుడు.. గుండెపోటుతో రోడ్డుపై పడిపోగా.. సత్వరం ఆస్పత్రికి తీసుకెళ్లడానికి చొరవ చూపలేదు. జనాన్ని క్లియర్ చేయకపోవడంతో ఆటోలో ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఆలస్యమైంది. అప్పటికే ఆయన అసువులు బాశారు. పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. గంగజాతర సందర్భంగా పోలీసులు చిత్తూరులో ట్రాఫిక్ ఆంక్షలు పెట్టారు. బారికేడ్లు పెట్టి ట్రాఫిక్ మళ్లించారు. అడుగడుగునా బందోబస్తులో ఉన్నారు. కాగా, మిట్టూరుకు చెందిన వెంకటేశ్(50) అమ్మవారిని దర్శించుకోవడానికి చర్చివీధిలో వెళుతుండగా గుండెపోటు వచ్చి కింద పడిపోయారు. స్థానికులంతా అతడి వద్దకు చేరుకుని గుమికూడారు. వెంటనే ఆస్పత్రికి ఆటోలో తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఆ ప్రాంతంలో డ్యూటీలో ఉన్న పోలీసులెవరూ ఏం జరిగిందని కూడా పట్టించుకోలేదు. కనీసం ఆటో వెళ్లేందుకు ట్రాఫిక్ క్లియర్ చేసివ్వడంలోనూ నిర్లక్ష్యం చూపారు. దీంతో రద్దీలో ఆటో ముందుకు వెళ్లే సరికి ఆలస్యమైంది. మామూలు రోజుల్లో అయితే ఆ సంఘటన స్థలం నుంచి ఆస్పత్రి రెండు మూడు నిమిషాల్లో వెళ్లొచ్చు. జనం విపరీతంగా ఉండటం, ట్రాఫిక్ వల్ల పది నిమిషాలు పట్టింది. ఇక, ఆస్పత్రి వద్ద పెట్టిన బారికేడ్ వద్దా బాధితుడిని తీసుకొస్తున్న ఆటోను ఆపారు. పోలీసులకు వివరించి.. వాళ్ల వదిలేసరికి రెండు నిమిషాలకుపైనే పట్టింది. ఇన్ని అడ్డంకులను దాటుకుని ఆస్పత్రికి వెళ్లారు. అతడిని పరీక్షించిన వైద్యులు.. అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కొంత శ్రద్ధతీసుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేసుంటే బతికేవాడని స్థానికులు అంటున్నారు.

ఆంక్షలతో ఇబ్బందులు

గంగమ్మను దర్శించుకోవడానికి నగరం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుచీ భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. దర్గా, ఎంఎస్ఆర్, కోర్టు సమీపం, తదితర ప్రాంతాల్లో పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి ట్రాఫిక్ మళ్లించడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండు నుంచి ఐదారు కిలోమీటర్ల దూరం వెళ్లి బస్సులు ఎక్కాల్సిన వచ్చింది. ఇదే అదనుగా ఆటోవాలాలు మూడింతలు రేట్లు పెంచారు. గ్రామీణ ప్రాంతాల వారైతే కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లారు. ఇక, గంగమ్మ దర్శనార్థం చిన్న పిల్లలను తీసుకొచ్చిన వారంతా కిలో మీటర్ల దూరం నడిచి వెళ్లేందుకు ఇబ్బందిపడి చాలా మంది వెనక్కి వెళ్లిపోయారు.



స్వామి దర్శనార్థం క్యూలో వేచి ఉన్న భక్తులు

కాణిపాకంలో భక్తుల రద్దీ

ఐరాల(కాణిపాకం), మే 22: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం బుధవారం భక్తులతో కిటికిటలాడింది. స్వామి దర్శనార్థం జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఉదయానికంతా క్యూలన్నీ పూర్తిగా నిండిపోయాయి. స్వామి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. క్యూలలో భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయాధికారులు చర్యలు తీసుకున్నారు.

నేటినుంచి వేరుశనగ విత్తనాల పంపిణీ

చిత్తూరు (సెంట్రల్), మే 22: ఖరీఫ్ సీజన్‌కు గాను జిల్లాలో గురువారం నుంచి సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసేందుకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. 38,655 క్వింటాళ్ల విత్తనాలు ఆర్‌బీకేల ద్వారా 40 శాతం సబ్సిడీతో జిల్లాలోని 502 రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేయనున్నారు. కే6 రకం బస్తా (30 కిలోలు) పూర్తి ధర రూ.1,710 కాగా, రాయితీ రూ.684 పోను, రైతు వాటా కింద రూ.1,026 చెల్లించాల్సి ఉంది. నారాయణి రకం బస్తా (30 కిలోల) పూర్తి ధర రూ.1,746 కాగా, రాయితీ రూ.698 పోను, రైతు వాటా కింద రూ.1,048 చెల్లించాలి. కౌలు, సన్న, చిన్నకారు రైతులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. రైతులు ఇప్పటికే ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకున్న విషయం తెలిసిందే.

11 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, మే 22: జిల్లావ్యాప్తంగా మంగళవారం ఉదయం 8 నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు 11 మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. చిత్తూరులో 22.0మి.మీ, గంగాధరనెల్లూరు 13.0, కార్వేటినగరం 8.2, నగరి 6.4, పుంగనూరు 4.4, పెద్దపంజాణి 4.2, గుడిపాల 4.2, శ్రీరంగరాజపురం 3.8, యాదమరి 3.2, రామకుప్పం 2.4, పులిచెర్ల 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మేనెల సాధారణ వర్షపాతం 67.2 మి.మీ కాగా, బుధవారం నాటికి 103.3 మి.మీ నమోదైంది.

సమన్వయంతో ఇంటర్, టెన్త్ పరీక్షలు

- డీఆర్వో పుల్లయ్య



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్, మే 22: ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్, టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలను అధికారులు సమన్వయంతో సజావుగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య ఆదేశించారు. బుధవారం ఆయన పరీక్షల నిర్వహణపై అధికారులతో డీఆర్వో ఛాంబర్‌లో సమావేశమయ్యారు. ఇంటర్ పరీక్షలు జరిగే 31 కేంద్రాల్లో 10,019 మంది విద్యార్థులు రాయనున్నారని, ఇందులో మొదటి సంవత్సరం 7,442మంది, ద్వితీయ సంవత్సరం 2,577 మంది ఉన్నారని వెల్లడించారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 15 కేంద్రాల్లో 1,302 మంది బాలురు, 757 మంది బాలికలు హాజరౌతున్నట్లు పేర్కొన్నారు. కేంద్రాల వద్ద ఎలాంటి అసౌకర్యమూ లేకుండా చూడాలన్నారు. ఆర్ఐవో సయ్యద్ మౌలా, డీఈవో దేవరాజులు, వైద్యశాఖ అధికారిణి శిరీష తదితరులు పాల్గొన్నారు.

టపాకాయల గోడౌన్లకు సీల్

- కౌంటింగ్ వరకు విక్రయాలు జరపరాదని ఈసీ ఆదేశం



గోడౌన్‌కు సీల్ వేస్తున్న రెవెన్యూ సిబ్బంది

చిత్తూరు రూరల్, మే 22: రాష్ట్రంలో ఎన్నికల తర్వాత జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యం లో కౌంటింగ్ వరకు టపాకాయలు, పెట్రోల్ బాటిళ్లలో విక్రయించరాదని ఈసీ ఆదేశాలు జారీ చేసింది. చిత్తూరు తహసీల్దార్ శ్రీనివాసులు రెడ్డి టపాకాయల గోడౌన్లు, పెట్రోల్ బంకుల యజమానులతో సమావేశమై జూన్ 4వ తేదీ వరకు ఈ నిబంధనలు పాటించాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మురకంబట్టులోని నాలుగు టపాకాయల గోడౌన్‌లకు జేసీ శ్రీనివాసులు ఆదేశాలతో సీల్ చేశారు. సమావేశంలో డీటీ కిరణ్, ఆర్.సంతోష్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో తెలంగాణ సీఎం



తిరుమల, మే 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దర్శించుకున్నారు. సీఎం హోదాలో తొలిసారిగా తన కుటుంబీకులతో కలిసి మంగళవారం రాత్రి తిరుమల చేరుకున్నారు. బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. అంతకుముందు మనవడి పుట్టెంట్రుకల మొక్కుకుని సమర్పించారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో సామాన్య భక్తుడిలా క్యూలైన్ ద్వారా ఆలయంలోకి 8.30 గంటలకు వెళ్లారు. అనంతరం ఆలయంలోనే సుమారు 45 నిమిషాలు గడిపారు. తిరిగి అతిథిగృహానికి చేరుకుని 9.50గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు.

బీసీవై మహిళా కార్యకర్తపై వైసీపీ నేతల హత్యాయత్నం

- మచ్చుకత్తితో పలుచోట్ల నరకడంతో తీవ్రగాయాలు
- రిమాండులో ఉన్న బాధితురాలి భర్త



చికిత్సపొందుతున్న అంజమ్మ

పుంగనూరు, మే 22: ఇంట్లో భోజనం చేస్తున్న బీసీవై మహిళా కార్యకర్తపై వైసీపీ నేతలు బుధవారం రాత్రి మచ్చుకత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితుల కథనం మేరకు.. పుంగనూరు మండలం మాగాండ్లపల్లె పంచాయతీ బరిణేపల్లెకు చెందిన పి.శంకర్ బీసీవైపార్టీ కార్యకర్త. రామచంద్రయాదవ్‌కు అనుచరుడు. గతనెల 29వ తేదీ మంత్రి పెద్దిరెడ్డి స్వగ్రామం ఎర్రాతివారిపల్లెలో బీసీవైపీ అభ్యర్థి రామచంద్రయాదవ్ ఎన్నికల ప్రచారానికి వెళ్లగా వైసీపీ శ్రేణులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ ఘటనలో రామచంద్రయాదవ్‌తో పాటు పలువురిపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. ఆ కేసులో శంకర్‌ను ఈనెల 19వ తేదీ పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు చిత్తూరు జైలుకు తరలించారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం శంకర్ భార్య పి.అంజమ్మ బరిణేపల్లెకి చెందిన వైసీపీ నేత చంద్రశేఖర్‌తో మాట్లాడుతూ తనభర్తపై అక్రమంగా కేసుపెట్టి ఎందుకు అరెస్టు చేయించారని, ఆయన సదుంకే వెళ్లలేదని నిలదీశారు. దీంతో చంద్రశేఖర్, అతడి సోదరుడు పురుషోత్తం మరికొందరు కలిసి రాత్రి 9 గంటల సమయంలో ఇంట్లో భోజనం చేస్తున్న అంజమ్మపై దాడి చేశారు. మచ్చుకత్తితో మెడ, వీపు, ఎడమచేయి, తొడమీద నరకడంతో గాయపడ్డారు. ఆ సమయంలో ఇంట్లో వృద్ధురాలు, అనారోగ్యంతో లేవలేని స్థితిలో ఉన్న అత్త లక్ష్మక్క మాత్రమే ఉన్నారు. పిల్లలు సెలవులకు బంధువుల ఇంటికి వెళ్లారు. తీవ్ర గాయాలతో అపస్మారకస్థితిలో ఉన్న అంజమ్మను గ్రామస్తులు, బంధువులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పుంగనూరు సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐ సుబ్బారెడ్డి ఆస్పత్రికి వెళ్లి బాధితురాలితో మాట్లాడి, కేసు నమోదు చేశారు. ఈ దాడిని బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ ఖండించారు. వచ్చే నెల 4న పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రౌడీరాజ్యం అంతంకావడం తథ్యమన్నారు.

పుంగనూరు ఎద్దుల పరుషలో ఇష్టారాజ్యంగా వసూళ్లు!

పుంగనూరు రూరల్, మే 22: పుంగనూరులోని మాణిక్యవరదరాజస్వామి పేరుతో ఏటా పుంగనూరు మతంగడ్డలో ఎద్దుల పరుష (ఎద్దుల సంత) నిర్వహిస్తారు. బుధవారం నిర్వహించిన పరుషకు సంబంధించి రైతులు, వ్యాపారుల నుంచి ఇష్టారాజ్యంగా నగదు వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. ఎద్దుల సంత నిర్వహించేందుకు అధికారులు బహిరంగవేలం వేసి.. వచ్చిన డబ్బును ఆలయ అభివృద్ధికి ఖర్చు చేస్తారు. ఈ క్రమంలో ఎద్దుల పరుషను వేలంలో పాడిన కాంట్రాక్టర్ ఒక్కో పశువుకు రూ.25 టిక్కెట్ వసూలు చేయాలి. కానీ, రూ.50 వంతున వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. లారీల్లో బయట ప్రాంతాలకు తరలించే పశువులకు సెస్సు మార్కెట్ కమిటీ చెక్‌పోస్టులలో వసూలు చేయాలి. కానీ, కాంట్రాక్టరే రవాణాకు సైతం నకిలీ రసీదులిచ్చి ఒక్కో ఆవుకు రూ.200 చొప్పున.. లారీకి రూ.2వేలు వసూళ్లు చేసి పంపుతున్నట్లు ఆరోపణలున్నాయి. దీనిపై మార్కెట్‌కమిటీ అధికారులు, దేవదాయశాఖ అధికారులు స్పందించడం లేదని రైతులు, వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఏఎంసీ కార్యదర్శి గోపిని వివరణ కోరగా సెస్సు మార్కెట్ కమిటీ వారు మాత్రామే వసూళ్లు చేయాలని, నకిలీ రసీదుల విషయంపై పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

జంతు సంరక్షణ నోడల్ అధికారిగా ఏఎస్పీ అరీఫుల్లా



చిత్తూరు, మే 22: జంతు సంరక్షణ చట్టాల అమలు జిల్లా స్థాయి నోడల్ అధికారిగా ఏఎస్పీ అరీఫుల్లాను ప్రభుత్వం నియమించింది. హైకోర్టు ఆదేశాల మేరకు పశువుల, జంతువుల సంరక్షణ చట్టాల అమలుకు ప్రభుత్వం అన్ని జిల్లాలకు నోడ ల్ ఆఫీసర్లను నియమించింది. జంతువుల అక్రమ రవాణా, వధ సమాచారం తెలిస్తే ప్రత్యక్షంగా లేదా ఫోన్ 9440796701, 9440900005 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

సబ్సిడీ విత్తన కాయల టోకెన్లు నిలిపివేత

- ఆందోళనలో పుంగనూరు రైతులు

పుంగనూరు, మే 22: ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను తక్కువగా కేటాయించింది. దీంతో స్టాకు ఉన్నంత వరకు అధికారులు టోకెన్లు పంపిణీ చేసి నిలిపేయడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పుంగనూరు వ్యవసాయ సబ్‌డివిజన్‌కు 12 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలను కేటాయించారు. పట్టాదారుపాసుపుస్తకం ఉన్న రైతులకు 40శాతం సబ్సిడీతో ఇస్తామన్నారు. ఈ మేరకు ఆర్‌బీకే (రైతు భరోసా కేంద్రాల్లో)లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించి టోకెన్లు పంపిణీ చేశారు. ఇలా పుంగనూరు మండలానికి 1950 క్వింటాళ్లు రాగా, 3410 మంది రైతులు టోకెన్లు పొందారు. చౌడేపల్లెలో 1350 క్వింటాళ్లకు 2462 మంది, సోమలలో 1088 క్వింటాళ్లకు 1538 మంది, సదుంలో 890 క్వింటాళ్లకు 264 మంది, పులిచెర్లలో 1099 క్వింటాళ్లకు 1256 మంది, రొంపిచెర్లలో 1100 క్వింటాళ్లకు 789 మంది, గంగవరంలో 1222 క్వింటాళ్లకు 1861 మంది, పెద్దపంజాణిలో 1745 క్వింటాళ్లకు 3498 మంది చొప్పున మొత్తం 12వేల క్వింటాళ్లకు 15,075 మంది రైతులు టోకెన్లు తీసుకున్నారు. పుంగనూరు మండలం భీమగానిపల్లెకు చెందిన రైతులు రమణ, సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, గంగులప్ప తదితరులు ఆర్బీకే వద్దకు వెళ్లగా టోకెన్లు నిలిపేసినట్లు చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 21, 22 తేదీల్లో ఆర్‌బీకేలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు సూచించారన్నారు. తాము 21తేదీ మధ్యాహ్నం 3 గంటలకు వెళితే, సమయం దాటిపోయిందని, విత్తనకాయలు నిల్వ ఉన్నంతవరకు టోకెన్లు ఇచ్చామని,ఇక, విత్తన కాయలు వస్తేనే రిజిస్టర్ చేసుకుంటామని తెలిపారన్నారు. వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులకు అవసరం లేకపోయినా టోకన్లు అధికంగా ఇచ్చినట్లు వారు ఆరోపించారు. స్టాకు ఉన్నంతవరకు టోకెన్లు ఇచ్చామని, మళ్లీ విత్తనకాయలు ప్రభుత్వం కేటాయిస్తే రైతులకు ఇస్తామని ఏడీఏ శివకుమార్‌రాజు చెప్పారు. 118 ఆర్‌బీకేల్లో విత్తనకాయల పంపిణీ జరుగుతుందన్నారు. కొన్నిచోట్ల రైతులకు అవసరం లేకపోతే వాటిని అవసరమున్న ప్రాంతాలకు తరలించి పంపిణీ చేస్తామన్నారు.



గంగమ్మ విశ్వరూపం

- పులకించిన భక్తజనం
- ముగిసిన జాతర



పేరంటాల వేషంలో కైకాల వంశస్తుడు సాంబ

తిరుపతి, మే 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ విశ్వరూప దర్శనం.. చెంప నరుకుడతో వారం రోజుల గంగజాతర వేడుక ముగిసింది. బుధవారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో పేరంటాల వేషం ధరించిన కైకాల వంశస్తుడు సాంబ గంగమ్మకు ఆలయానికి చేరుకున్నాడు. అప్పటికే ఆచారులు విశ్వరూప స్తంభానికి ఎండుగడ్డి, బంకమన్నుతో అమ్మవారి విశ్వరూపాన్ని తయారుచేసి ఉంచడంతో భక్తుల అమ్మవారి నామస్మరణల మధ్య పేరంటాల వేషధారి చెంప నరికారు. ఆ ప్రతిమ మన్ను కోసం భక్తులు ఎగబడ్డారు. మన్ను దొరికినవారు ఎంతో పవిత్రంగా ఇంటికి తీసుకెళ్లారు. కాగా, మంగళవారం అర్ధరాత్రి నుంచి కూడా మగవారు ఆడ వేషాలు ధరించి.. డప్పుల వాయిద్యాలతో ఒక్కో వీధి నుంచి బృందాలుగా ఏర్పడి.. చిందులేస్తూ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. మహిళలు సైతం పూనకంతో ఊగిపోతూ కనిపించారు. ఆలయానికి చేరుకుని వజ్రకిరీటధారి అయిన గంగమ్మను దర్శించుకున్నారు. అనంతరం విశ్వరూప దర్శనం కోసం అక్కడే ఉండిపోయి, దర్శనం చేసుకుని తిరుగుముఖం పట్టారు. దీంతో జాతర మహోత్సవం పరిసమాప్తి అయ్యింది.

కుప్పం తరలిన జనం..బోసిపోయిన గ్రామాలు


నిర్మానుష్యంగా ఉన్న రామకుప్పం ప్రధానరహదారి

రామకుప్పం, మే 22: కుప్పంలోని తిరుపతి గంగమ్మ జాతరలో ప్రధాన ఘట్టమైన అమ్మవారి విశ్వరూప దర్శనం కోసం బుధవారం రామకుప్పం మండలం నుంచి జనం భారీగా తరలివెళ్లారు. దీంతో రామకుప్పంతో బాటూ అన్ని గ్రామాలు జనసంచారం లేక వీధులన్నీ బోసిపోయాయి. తెల్లవారు జాము నుంచే జనం గ్రామాల నుంచి కుప్పం చేరుకున్నారు. అమ్మవారి శిరస్సు ఊరేగింపు వద్ద జంతుబలులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణ పొలిమేర్లలోనే బంధుమిత్రులకు మాంసహారంతో విందు భోజనాలు వడ్డించారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో వైభవంగా పౌర్ణమి పూజలు



రామకుప్పం, మే 22: రామకుప్పంలోని అన్నపూర్ణదేవీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం పౌర్ణమి పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి, స్వామివారికి ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించి విశేష అలంకరణలు చేశారు. రాత్రి స్వామి వారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు జరిపించారు. పట్టణం నుంచే కాకుండా వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని, స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద భక్తులు కొబ్బరికాయలు కొట్టి స్వామివారికి కర్పూరహారతులిచ్చారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.

నేటి నుంచి వేరుశనగ విత్తన విక్రయం

సదుం, మే 22: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రాయితీ ధరలపై రైతులకు వేరుశనగ విత్తన కాయలు గురువారం నుంచి విక్రయించనున్నట్లు ఏవో హరిప్రసాద్ తెలిపారు. తొలివిడతగా ప్రస్తుతం కదిరి-6 రకం కాయలు 1100 క్వింటాళ్లు, నారాయణి రకం 305 క్వింటాళ్లు పంపిణీకి అందుబాటులో ఉన్నాయని వివరించారు. కదిరి-6 రకం 30 కిలోల బస్తా ధర రూ.1710లు, నారాయణి రకం బస్తా రూ.1746లకు విక్రయిస్తున్నట్లు వివరించారు. విత్తనకాయలు అవసరమైన రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం నకలు, మొబైల్ నెంబరుతో తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించాలని ఆయన సూచించారు.

వేరుశనగ విత్తనాలు తప్పకుండా విత్తాలి


విత్తన నమోదు ప్రక్రియను తనిఖీచేస్తున్న ఏడీఏ శివకుమార్

గంగవరం, మే 22: వేరుశనగ విత్తనాలు తీసుకునే రైతులు తప్పకుండా పంట సాగుచేయాలని వ్యవసాయ శాఖ ఏడీఏ శివకుమార్ తెలిపారు. బుధవారం గంగవరం మండలంలోని ఆర్బీకేలలో సబ్సిడీ వేరుశనగ విత్తనకాయల కోసం చేపట్టిన పేర్ల నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. గుండుగల్లు, కల్లుపల్లె, పత్తికొండ ఆర్బీకేలలో తనిఖీలు చేసి రైతులను ఉద్దేశించి మాట్లాడారు. మండలానికి 1440 క్వింటాళ్ల విత్తనకాయలు అందుబాటులోకి వచ్చాయన్నారు. కావాల్సిన రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఏఓ హేమలత, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలకు మాత్రమే పెట్రోల్, డీజిల్ పట్టాలి


కల్లూరులో పెట్రోల్ బంకు యజమానికి నోటీసులు అందజేస్తున్న అధికారులు

కల్లూరు, మే 22: పెట్రోల్ బంకుల్లో వాహనాలకు మాత్రమే పెట్రోల్, డీజిల్ పట్టాలని, నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని తహసీల్దార్ వసంతలత, ఎంపీడీవో సురేష్‌బాబు, ఈఓపీఆర్డీ యుగందర్ హెచ్చరించారు. పులిచెర్ల మండలం లోని కల్లూరు, కొమ్మిరెడ్డిగారిపల్లి, ఎల్లంకివారిపల్లి, మంగళంపేట, పులిచెర్లలోని పెట్రోల్ బంకులను బుధవారం మండలస్థాయి అధికారులు పరిశీలించారు. నిబంధనలతో కూడిన నోటీసులను బంకు యజమానులకు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పోలింగ్ అనంతరం రాష్ట్రంలో తలెత్తిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఈ నిర్ణయం తీసుకుందన్నారు. లైసెన్సులు కలిగిన యజమానులు నిబంధనలు ఉల్లంఘించి టపాకాయలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

హంస వాహనంపై మృత్యుంజయేశ్వరుడి ఊరేగింపు



చౌడేపల్లె, మే22: స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో 10వ రోజు హంస వాహనంపై ఆది దంపతులు ఊరే గారు. బుధవారం ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు రాజశేఖర్ దీక్షి తులు, కుమార, మహేష్ దీక్షితులు పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. పూలతో, ప్రభలతో, విద్యుత్ దీపాలతో అలంకరించిన అశ్వ వాహనంపై రాత్రి ఉత్సవ మూర్తులను అధిష్ఠింపచేశారు. తర్వాత మంగళ వాయి ద్యాల, చెక్క భజనలు, కోలాటాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు కర్పూర హారతులు సమర్పించారు. ఉభయ దారులుగా బ్రహ్మణ సంఘం సభ్యులు వ్యవహరించారు.

కమనీయం..కల్యాణవెంకన్న కల్యాణోత్సవం



బైరెడ్డిపల్లె, మే 22 : మండలంలోని పట్నపల్లె కల్యాణవెంకటరమణస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శ్రీవారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వివిధరకాల సుగంధ పుష్పాలతో సుందరంగా తీర్చిదిద్దిన మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణవెంకన్న ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అర్చకులు మురళీకృష్ణాచార్యులు ప్రత్యేకపూజలు చేసి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని జరిపించారు. అధికసంఖ్యలో భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఉభయదారులకు శ్రీవారి శేషవస్త్రంతో పాటు ప్రసాదాలు అందజేశారు. ఆలయం వద్ద దాతల సహకారంతో అన్నదానం చేశారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో చోరీ

బైరెడ్డిపల్లె, మే 22 : మండలంలోని తీర్థం గ్రామసమీపంలో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఆచారి బుధవారం బైరెడ్డిపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన కథనం మేరకు.. ఆలయ ధర్మకర్త మంగళవారం రాత్రి ఆలయానికి తాళాలు వేసి వెళ్లారు. ఉదయం పూజ చేయడానికి రాగా ఆలయం ముందు గేటుకు వేసివున్న తాళం పగిలిపోయి ఉంది. లోనికెళ్లి చూడగా గర్భగుడిలో గోవిందమ్మ మూలవిరాట్‌కు అలంకరించి ఉండిన 12 గ్రాముల బంగారు మంగళసూత్రాలు కనిపించలేదు. అలాగే రెండు కంచు దీపస్తంభాలు, పెద్ద స్టీల్ హుండీ, నగదు, వస్తువులు చోరీకి గురయ్యాయి.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

యువతి అదృశ్యం.. పోలీసులకు ఫిర్యాదు

పుంగనూరు రూరల్, మే22: మండలంలోని గుడిసిబండ పంచాయతీ డి.అగ్ర హారం గ్రామానికి చెందిన నాగరాజ కుమార్తె ఎం.వర్షిత(19) మధ్యాహ్నం నుంచి కనిపించలేదని ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పుంగనూరు రూరల్, మే22: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన మంగళవారం రాత్రి పట్టణంలో వెలుగుచూసింది. అనారోగ్యంగా ఉండడంతో ఓబులమ్మ స్థానిక కొత్తయిండ్లులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లింది. ఆ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి ఇంట్లోని నగదు, బంగారు దోచుకెళ్లారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు



పుంగనూరు రూరల్, మే22: మండలంలోని ఏడూరు సమీపంలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

జైలులోని టీడీపీ నాయకులకు చల్లాబాబు పరామర్శ



చౌడేపల్లె, మే15: మదనపల్లె సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్న టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డిని, టీడీపీ కార్యకర్తలను పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి బుధవారం పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ కార్యాలయం పునరుద్ధరణ



చౌడేపల్లె, మే22: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ సమీపంలో పిడుగులు పడటంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి దగ్ధమైన కార్యాలయాన్ని తిరిగి ఆలయ ఈవో చంద్రమౌళి తన సొంత నిధులతో పునరుద్ధరించారు. ఈ నెల 14న జరిగిన ప్రమాదంలో అమ్మవారి ఫొటో, ఫర్నిచర్, ఏసీలు, కంప్యూటర్, ప్రింటర్, ఫ్యాన్లు, డోర్లు, సీసీ కెమెరాలు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. ఈ క్రమంలో ఆలయ ఈవో చంద్రమౌళి సుమారు రూ.3 లక్షలు తన సొంత నిధులతో కార్యాలయాన్ని తిరిగి సిద్ధం చేశారు. బుధవారం ఆలయ వేదపండితులచే పుణ్యాహవచనం, ప్రత్యేక పూజలు చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు.

లక్ష్మీ నరసింహుడికి విశేషపూజలు



కల్లూరు, మే 22: పులిచెర్ల మండలం దేవళం పేటలో కొలువైన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో బుధవారం స్వామి వారి జయంతి ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి ఉదయం సుప్రభాతసేవ, విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, అభిషేకం, హోమం, మూలమంత్రం, మహానైవేద్యం నిర్వహించారు. విశేషాలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు అర్చకులు అనంతకుమారాచార్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

జాతర ఘనం.. వెల్లువెత్తిన జనం!



కుప్పం గంగమ్మ విశ్వరూప దర్శనం చేసుకుంటున్న భక్తులు, అమ్మవారికి కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు

కుప్పం, మే 22: కుప్పంలో గంగజాతర వైభవోపేతంగా కొనసాగి ముగిసింది. రాజకీయపరమైన పాలకమండళ్లు లేకపోయినా, అధికారులు అంతగా ఏర్పాట్లు చేయకపోయినా అమ్మవారు తన జాతరను తానే నిర్విఘ్నంగా జరుపుకోగలిగింది. మరీ బుధవారంనాటి గంగమ్మ విశ్వరూప దర్శనం భక్త జనుల ఒడలు పులకరింపజేసింది. గతంతో పోలిస్తే భక్తులు తగ్గినట్లు కనిపించినా అది నిజం కాదు. ఇక్కడే రెండు రోజులపాటు ఉండేవారికంటే, వివిధ ప్రాంతాలనుంచి అమ్మవారి దర్శనం చేసుకుని అప్పటికప్పుడు తిరుగు ప్రయాణమై వెళ్లేవారు ఈసారి అధికంగా కనిపించడమే దీనికి ప్రధాన కారణం. కుప్పంలో జాతర అంటే ఒక్క ప్రాంతానికి, ఒక్క రాష్ట్రానికి సంబంధించి కానేకాదు. అది ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక మూడు రాష్ట్రాల వేడుక. ప్రత్యేకించి అమ్మవారి విశ్వరూప దర్శనానికి తండోపతండాలుగా తరలివచ్చారు ఈ మూడు రాష్ట్రాలనుంచి భక్తజనం. ఎప్పటెప్పటివో మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని తనివితీరా సేవించుకున్నారు.

● అంగళ్లు.. పొంగళ్లు:

అంగడి అన్నా, పొంగలి అన్నా అచ్చమైన పల్లెటూరు గుర్తుకొస్తుంది. కార్పొరేట్ షాపింగ్ మాళ్ల విజృంభణలో కుప్పం కూడా కొద్దికొద్దిగా ఈ పల్లెటూరి వాసనను కోల్పోతోంది. నలువైపులా వెలసిన కార్పొరేట్ అంతస్తుల దుకాణాల మధ్య చిన్నాచితకా అంగళ్లు మాయమైపోతున్న పరిస్థితి. అంతేనా.. కుటుంబాలు కలిసి చేసుకునే పొంగళ్లు, ఇంటిల్లిపాదీ కలిసి కూచుని పంక్తి భోజనం చేసే రోజులు కూడా గతంలోకి జారిపోతున్న కాలం ఇది. ఇటువంటి సంధికాలంలో కుప్పంలో వెలసిన శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర మహోత్సవం మళ్లీ పల్లెటూరి అంగళ్లను, ఘుమఘుమల పొంగళ్లను కుప్పానికి తీసుకొచ్చింది. ఎక్కడెక్కడినుంచో తరలివచ్చిన నానా రకాలైన అంగళ్లు, అటు కుప్పం వీధుల్లో తాత్కాలిక టెంట్ల రూపంలో వెలిశాయి. అల్లం మురబ్బానుంచి అత్యాధునిక ఎలక్ట్రానిక్ వస్తువుల దాకా ఈ అంగళ్లలో ఉంచి అమ్మకాలు సాగించారు. ఇక మహిళలు ఇష్టపడే అలంకార వస్తువులు, దుస్తులు, వంట పాత్రలు, పిల్లలు మారాం చేసి మరీ కొనిపించే బొమ్మల అంగళ్లు సరేసరి. ఏ అంగడి చూసినా జనతో కిటకిటలాడింది. ఫ్యాషన్ నకిలీ జ్యువలరీ ఆధునిక పడతులు, బొట్టుబిళ్లలు, రిబ్బన్లు బేరమాడుతున్న పల్లెటూరి పడుచులు, బొమ్మలకోసం మారాం చేస్తున్న బుడతలు, అమ్మాయిల కంటి చూపులకోసం కాపుకాసిన వయసు పోరగాళ్లు.. ఒక్కమాటలో చెప్పాలంటే కుప్పం సకల కళలతో కళకళలాడింది. ఇక అమ్మవారికి జంతుబలులిచ్చిన కుటుంబాలు, జాతరకు తమ ఇంటికి వచ్చిన బంధుమిత్రులకు అండాలకు అండాలు పొంగళ్లు, బిరియానీలు వండి వార్చింది. పంక్తిలు తీర్చి కడుపారా భోజనాలు వడ్డించింది. కుప్పం జాతరలో మనం మరిచిపోతున్న సమిష్టితత్వం వెల్లివిరిసింది.


అమ్మవారి వేషధారణలో భక్తులు - దుకాణాల వద్ద భక్తుల సందడి

పులిచెర్ల మండలాన్ని చుట్టేస్తున్న ఏనుగులు

● పంటలపై కొనసాగుతున్న దాడులు
● ఆందోళనలో రైతులు

కల్లూరు, మే 22: పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతున్నాయి. మూడు రోజుల క్రితం మండలంలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేస్తూ మండలాన్ని చుట్టేస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందు తున్నారు. సదుం అటవీ ప్రాంతం నుంచి తొలుత పాతపేట పంచాయతీలోకి అడుగు పెట్టిన ఏనుగులు రెండు రోజుల్లోనే పాతపేట, చల్లావారిపల్లి, కల్లూరు, పాళెం, దేవళం పేట పంచాయతీల్లో పంటలను నాశనం చేశాయి. భీమవరం అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న ఎల్లంకివారిపల్లి పంచాయతీ దిగుమూరివారిపల్లి సమీపంలో బుధవారం వేకువజామున ఏడు ఏనుగులు పంటలను ధ్వంసం చేశాయి. ఎల్లంపల్లికి చెందిన రైతు రఘునాథరెడ్డి, దిగుమూర్తివారిపల్లికి చెందిన రైతులు చంద్రశేఖర్‌నాయుడు, సరసమ్మ మామిడి చెట్లను విరిచేశాయి. కాయలను తిని నాశనం చేశాయి. అనంతరం సమీపంలోని అడవిలోకి వెళ్లిపోయాయి. ఏనుగుల వరుస దాడులతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


దిగుమూర్తివారిపల్లి వద్ద ఏనుగులు విరిచేసిన మామిడి చెట్లు

నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలి : డ్వామా పీడీ


మినీ అమృత్ సరోవర్ పనిని పరిశీలిస్తున్న పీడీ రాజశేఖర్

కల్లూరు, మే 22: ఉపాధి హామీ పథకంలో సిబ్బందికి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయా లని డ్వామా పీడీ రాజ శేఖర్ ఆదేశించారు. పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. మినీ అమృత్ సరోవర్, సప్లయ్ చానెల్ తదితర పనులను పరిశీలించారు. మస్టర్లను, కూలీల హాజరును పరిశీలించారు. వేతనాలు సక్రమంగా వస్తున్నా యా లేదా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూలీలకు పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. లేబర్ మొబలైజేషన్‌లో రోజువారి లక్ష్యాలను సాధించడంలో వెనుకబడిన ఎఫ్ఏలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏపీవో షౌకత్‌అలీ, జేఈ కృష్ణయ్య, టీఏలు, ఎఫ్ఏలు, కూలీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు


దెబ్బతిన్న కారు

కల్లూరు, మే 22: పులిచెర్ల మండలం దిగువపోకలవారిపల్లి పంచాయతీ ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... తెలంగాణ రాష్ట్రం గద్వాల్ పట్టణానికి చెందిన ఐదుగురు తమిళనాడు రాష్ట్రం అరుణాచలం మహాశివుడి దర్శనానికి కారులో బయలుదేరారు. ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో వెళుతున్నారు. ముందు ఓ ట్రాక్టర్ వెళుతోంది. ట్రాక్టర్ డ్రైవర్ ఎలాంటి సిగ్నల్ వేయకుండా రోడ్డుకు కుడివైపు తిప్పాడు. దీంతో కారు అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీకొంది. కారులో వెళుతున్న తెలంగాణా వాసులు పద్మమ్మ (61), లక్ష్మి (29), 6 నెలల చిన్నారి రుత్విక్, ట్రాక్టర్ డ్రైవర్ మధుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రైవేటు వాహనంలో పీలేరు ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కారు ఎడమవైపు దెబ్బతింది. కారులోని బెలూన్‌లు ఓపెన్ కావడంతో కారులోని వారికి ప్రాణాపాయం తప్పిందని క్షతగాత్రుల కుటుంబీకులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాండవ విగ్రహాల ఊరేగింపు



సోమల, మే 22: ఇరికిపెంట పంచాయతీ భారతం మిట్టలో గురువారం నుంచి జూన్ 9వ తేదీ వరకు మహాభారత యజ్ఞం పురస్కరించుకుని బుధవారం పంచపాండవ విగ్రహాలను సోమలలో ఊరేగించారు. మహిళలు ఇంటింటా కర్పూరహారతులు సమర్పించారు. భారత యజ్ఞం నిర్వహణకు కానుకలు అందజేశారు. కాగా భారతం మిట్ట పంచపాండవుల ఆలయంలో గురువారం ధ్వజారోహణం, సర్పయాగం, వ్యాస జననం కార్యక్రమాలకు బత్తల మనోహర ఉభయదారులుగా వ్యవహరించనున్నారు. పగలు గీతావాణి భాగవ తారిణిచే హరికథ కాలక్షేపం, రాత్రి పీలేరు సదాశివయ్య నాయుడు సారథ్యంలో వెంకటేశ్వర నాట్య కళామండలి నాటక ప్రదర్శనలు జరగనున్నాయి.

నిబంధనల మేరకే పెట్రోలు, డీజిల్ విక్రయించాలి

రామకుప్పం, మే 22: పెట్రోలు బంకుల్లో ప్రభుత్వ నిబంధనల మేరకే పెట్రోలు, డీజిల్ విక్రయించాలని తహసీల్దారు శ్రీధర్ సూచించారు. బుధవారం ఆయన పట్టణంలోని పెట్రోలు బంకును తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ నిబంధనలు అమలులో ఉండటం వల్ల బంకుల్లో కేవలం వాహనాలకు మాత్రమే పెట్రోలు, డీజిల్ పట్టాలని బంకు సిబ్బందిని ఆదేశించారు. బాటిళ్లకు, డ్రమ్ములకు నింపరాదని స్పష్టంచేశారు. ఒకవేళ నిబంధనలు పాటించకుంటే లైసెన్సులు రద్దుచేస్తామని హెచ్చరించారు.

పెట్రోల్ బంకుల తనిఖీ

సోమల, మే 22: సోమలలో పెట్రోల్ బంకులను బుధవారం తహసీల్ధార్ నాగరాజ, ఎంపీడీవో నారాయణ తనిఖీ చేశారు. కాన్లు, బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ పట్టవద్దని నిర్వాహకులను ఆదేశించారు. నిబంధనలు పాటించనివారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, ఆర్ఐ సుబుక్తుల్లా, వీఆర్వో శ్రీజ, రెడ్డెప్ప పాల్గొన్నారు.

వేరుశనగకాయలు సద్వినియోగం చేసుకోండి

చౌడేపల్లె, మే22: రాయితీ విత్తన వేరుశనగకాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ శివకుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మండలంలోని దుర్గ సముద్రం, చారాల, పుదిపట్ల రైతుభరోసా కేంద్రాలలో వేరుశనగకాయల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఏవో జ్యోతి, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు వ్యాకరణంపై శిక్షణ

కార్వేటినగరం, మే 22: వేసవి శిక్షణలో భాగంగా బుధవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు తెలుగు వ్యాకరణంపై అవగాహన కల్పించారు. తెలుగు పండిట్ మునిలక్ష్మి వ్యాకరణం గురించి విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ అధికారి శంకరబాబు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన దగ్గుమళ్ల

చిత్తూరు సిటీ, మే 22: చిత్తూరు పార్లమెంటు కూటమి ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. బుధవారం నగర సమీపంలోని ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరచిన ఈవీఎంలను సీసీ టీవీల ద్వారా పరిశీలించారు. భద్రత, పోలీసుల నిఘా వంటి అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ ఆయన వెంట ఉన్నారు.

వైభవంగా గంగమ్మ జలది ఉత్సవం


గంగమ్మను జలదికి తరలిస్తున్న భక్తులు, జలది ఉత్సవానికి తరలివచ్చిన వేలాది మంది భక్తులు

పలమనేరు, మే22 : పలమనేరులో బుధ వారం గంగమ్మ జలది ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ నెల 20 వతేదీ సోమవారం అర్ధరాత్రి వేణుగోపాల స్వామి గుడి నుంచి బయలు దేరిన గంగమ్మ శిరస్సును 21వ తేదీ మంగళవారం తెల్లవారు జాము వరకు పుర వీధుల్లో ఊరేగించి గంగమ్మ గుడిలో ప్రతిష్ఠిం చారు. మంగళవారం ఉదయం నుంచి బుధ వారం తెల్లవారుజాము వరకు వేలాది మంది భక్తులు అమ్మవారి విశ్వరూపాన్ని దర్శించు కున్నారు. తర్వాత గంగమ్మను జలది ఉత్సవానికి తరలించారు. పట్టణ సమీపంలో ఈశాన్య దిశలో గాంధీనగర్‌లోని వ్యవసాయ బావివద్దకు అమ్మ వారి శిరస్సును వేలాది మంది భక్తుల మధ్య తీసుకెళ్లి జలాభిషేకం నిర్వహిం చారు. దీంతో గంగమ్మ జాతర ముగిసింది. భక్తులు జంతు బలులు సమర్పించారు. కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు పట్టారు.

డప్పుల మోత లేదు..డీజే సౌండ్లు లేవు..

మూడు రోజుల పాటు జాతర సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. ఎన్నికల కోడ్ ఉండడంతో ఎటువంటి బాణసంచా కాల్చకుండా, డీజే మోతలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జాతర ముగిసింది. ఎండోమెంట్ అధికారులు గంగజాతరను సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు.

ప్రజలందరికీ కృతజ్ఞతలు:

జాతరకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది ప్రజలు విచ్చేశారు. వారికి ఎటు వంటి ఇబ్బందులు లేకుండా అన్నదానాలు చేపట్టిన కులసంఘాల నాయకులకు, మజ్జిగ పంపిణీ చేసిన వివిధ ప్రజా సంఘాలకు, పోలీసులకు, ఆలయ కార్యనిర్వహణ అధికారి కమలాకరరావు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు హుండీ లెక్కింపు

పలమనేరులో గంగమ్మ జాతర సందర్భంగా గంగమ్మ గుడిలో ఏర్పాటుచేసిన ప్రత్యేక జాతర హుండీలను ఈ నెల 23వ తేదీ ఉదయం 9 గంటలకు లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి కమలాకరరావు తెలిపారు. భక్తులు, గ్రామపెద్దల సమక్షంలో ఈ హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

శరవేగంగా జాతర పనులు


ఆర్చి నిర్మిస్తున్న కూలీలు

ఐరాల, మే 22: గార్గేయ నదీ తీరాన వెలసిన పాలేటమ్మ ఆలయంలో గంగ జాతర పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఆలయంలో ఈ నెల 28, 29 తేదీల్లో జాతర నిర్వహించనున్నారు. అమ్మవారిని కొలువుతీర్చడానికి షెడ్డు నిర్మిస్తున్నారు. గ్రామ వీధుల్లో విద్యుత్ లైట్లను అమర్చుతున్నారు. మరో మూడు రోజుల్లో ఏర్పాట్లు పూర్తవుతాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంకే.బాలాజి తెలిపారు.

బాటిల్స్, కంటైనర్స్‌కు పెట్రోల్ పడితే లైసెన్స్ రద్దు


49.కొత్తపల్లెలో పెట్రోల్ బంకు యజమానికి నోటీసు ఇస్తున్న తహసీల్దార్

శ్రీరంగరాజపురం, మే 22: ఈసీ నిబంధనలకు విరుద్ధంగా బాటిల్స్, కంటైనర్స్‌కు పెట్రోల్ పడితే లైసెన్స్ రద్దు చేస్తామని తహసీల్దార్ అల్ఫ్రెడ్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం మండలంలోని 49.కొత్తపల్లెమిట్ట, ఎస్ఆర్‌పురం పెట్రోల్ బంకుల యజమానులకు నోటీసులు జారీ చేశారు. చొక్కమడుగు సమీపంలోని టపాకాయల విక్రయ కేంద్రాల వద్ద బాణసంచా అమ్మరాదని నోటీసులు అంటించారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి

పాలసముద్రం, మే 22: ఉపాధి కూలీల సంఖ్య గణనీయంగా పెంచాలని ఎంపీడీవో రామనాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ప్రతి పంచాయతీలోనూ రోజుకు 200 మంది కూలీలు పనిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సంఖ్య తగ్గితే ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

నిరుపేదలకు అన్నదానం

గుడిపాల, మే 22: మండల కేంద్రంలోని అన్నాక్యాంటీన్‌లో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం చేశారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్ జన్మదినం సందర్భంగా ఆయన తండ్రి రమేష్, మాజీ సర్పంచ్ ప్రతాప్ నాయుడు చేతుల మీదుగా ఈ కార్యక్రమం చేపట్టారు. జనసేన పార్టీ అధ్యక్షుడు రూప్ కుమార్, టీడీపీ నాయకులు హరి, నాగరాజ్, చల్లా, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, కిట్టు, చందు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గంగ జాతర


197 రామాపురంలో గంగమ్మను ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్తులు

గుడిపాల, మే 22: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం గంగమ్మ జాతర ముగిసింది. 197 రామాపురం, పేయనపల్లి, కోలావూరు, కొత్తూరు తదితర గ్రామాల్లో చివరి రోజున గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, పురవీధుల్లో ఊరేగించారు. ఆయా గ్రామాల ప్రజలు అమ్మవారికి కర్పూర హారతులిచ్చి, మొక్కులు తీర్చుకున్నారు.

జీజేఎం విజయం తథ్యం

గుడిపాల, మే 22: చిత్తూరు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడు తప్పకుండా విజయం సాధిస్తారని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల హేమాద్రి నాయుడు అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చిత్తూరులో టీడీపీకి 20వేల ఓట్ల మెజార్టీ వస్తుందని, ఉమ్మడి జిల్లాల్లో 12-13 స్థానాలు కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని విమర్శించారు.

క్యాడెట్లకు పక్కాగా శిక్షణ ఇవ్వాలి

చిత్తూరు (సెంట్రల్), మే 22 : ఎన్‌సీసీ క్యాడెట్లకు అన్ని రంగాల్లో శిక్షణ పక్కాగా ఇవ్వాలని తిరుపతి గ్రూపు కమాండర్ కల్నల్ యోగేష్ డోంగ్రా కోరి పేర్కొన్నారు. పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న క్యాంపును గురువారం ఆయన పరిశీలించారు. తుపాకీ, మ్యాప్ రీడింగ్, డ్రిల్, హెల్త్ అండ్ హైజీన్, ప్రాక్టికల్స్, థియరీ అంశాలపై శిక్షణను సమీక్షించారు. క్యాంపు కమాండెంట్ మేజర్ లోకనాథన్, ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్‌రెడ్డి, గిరిధర్, రమేష్, చంద్ర పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత మృతి


తంగంశెట్టి (ఫైల్)

బంగారుపాళ్యం, మే 22: మండలంలోని మొగిలి వెంకటగిరి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు తంగంశెట్టి (86) బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన టీడీపీ పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్నారు. ఆయన మృతిపట్ల పార్టీ మండలాధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. సంతాపం తెలిపిన వారిలో నాయకులు ఎన్‌పీ జయచంద్ర నాయుడు, కోకా ప్రకాష్‌నాయుడు, సురేంద్ర నాయుడు, ధరణి, కవి, చందు, జనార్ధన్ గౌడ్, నాగరాజ్ గౌడ్, అమరావతి తదితరులు ఉన్నారు.

వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

గుడిపాల, మే 22: గుర్తు తెలియని వాహనం ఢీకొని మండలంలోని చెరుకూరికండిగ గ్రామానికి చెందిన నవీన్‌కు గాయాలయ్యాయి. బుధవారం ఉదయం ఆయన చిత్తూరు - వేలూరు జాతీయ రహదారి దాటుతుండగా వేగంగా వచ్చిన వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడడంతో స్థానికులు రామాపురం సీఎంసీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో రాణిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గుడిపాల పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు వ్యాకరణంపై శిక్షణ



కార్వేటినగరం, మే 22: వేసవి శిక్షణలో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ గ్రంథాలయంలో విద్యార్థులకు తెలుగు వ్యాకరణంపై అవగాహన కల్పించారు. తెలుగు పండిట్ మునిలక్ష్మి వ్యాకరణం గురించి విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ అధికారి శంకరబాబు పాల్గొన్నారు.

ఆలయ దారిలో మురికినీరు తొలగించండి



కార్వేటినగరం, మే 22: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయానికి వెళ్లే దారిలో మురికినీరు నిల్వ ఉంటూ భక్తుల రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. కొన్ని రోజులుగా నిల్వ ఉండడంతో నీరు దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఈనెల 26వ తేదీ నుంచి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు దీనిపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.




చిన్నారుల కళా ప్రదర్శనలు


గంగమ్మను దర్శించుకుంటున్న దగ్గుమళ్ల ప్రసాదరావు

కరుణించి అభయమివ్వు గంగమ్మా..!

- చిత్తూరులో ముగిసిన జాతర
- నడివీధి గంగమ్మ సేవలో దగ్గుమళ్ల వరప్రసాద్


కర్ణాటక హారోం మర లింగాయత్ కళాకారుల ప్రదర్శన


కుటుంబ సభ్యులతో కలిసి సారె తీసుకెళుతున్న సీకే బాబు


అమ్మవారి ప్రతిమతో ఓంశక్తి భక్తురాలి ప్రదర్శన

చిత్తూరు కల్చరల్, మే 22: నగరంలో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న చిత్తూరు నడివీధి గంగమ్మ జాతర బుధవారం ముగిసింది. సాయంత్రం అమ్మవారికి కుంభ నైవేద్యం సమర్పించి, భక్తులకు పంచారు. పొన్నియమ్మ గుడి వర్తక సంఘం ఆధ్వర్యంలో పొన్నియమ్మ గుడి, బజారు వీధి నడివీధి గంగమ్మ వద్ద భక్తులకు అన్నదానం చేశారు. బజారువీధిలో నడివీధి గంగమ్మకు జాతర వంశపారంపర్య ధర్మకర్త సీకే బాబు తన కుటుంబ సభ్యులతో కలిసి సారెతోపాటు పూలమాల సమర్పించారు. గంగమ్మకు మహా మంగళహారతి ఇచ్చి నిమజ్జన ఊరేగింపు ప్రారంభించారు. తెలుగు దేశం పార్టీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల వరప్రసాదరావు అమ్మవారికి పూజలు చేయించారు. నెల్లూరు సిటీ ఆర్కెస్ట్రా, కర్ణాటక లింగాయత హరివేం హరహర డప్పులు, మేళతాళాలు, కోలాటాలు, చెక్కభజనలతో కోలాహలంగా ఊరేగింపు నిర్వహించారు. కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయం నుంచి ఓం శక్తి భక్తులు శరీరాలకు శూలాలు గుచ్చుకుని చేసిన విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులకు చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ, తాగునీరు, జ్యూస్‌లు పంపిణీ చేశారు. వ్యాపార సంఘాల వారు తాగునీరు, అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీకే లావణ్యబాబు, సీకే సాయిక్రిష్ణారెడ్డి, ఉత్సవ నిర్వాహకులు వెంకటేష్, గుణశేఖర్, హేమంత్‌కుమార్, వేమారెడ్డి, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

వాడవాడల గంగమ్మల నిమజ్జనాలు

నగరంలో బుధవారం గంగమ్మ నిమజ్జనం వేడుకగా జరిగింది. సంతపేటలో ఉత్సవ నిర్వాహకులు భూపేష్ గోపినాథ్, గిరింపేటలో డిప్యూటి మేయర్ ఆర్.సి. చంద్రశేఖర్, మంగసముద్రం, ఓబనపల్లె, మంగసముద్రం హౌసింగ్‌కాలనీల్లో జ్ఞాన జగదీశ్, మురకంబట్టులో కార్పొరేటర్ నవీన్, దొడిపల్లెలో కార్పొరేటర్ ధళవాయి సునీత శివకుమార్, ఎల్.జి. తిరుకుమరన్, కొంగారెడ్డిపల్లెలో డిప్యూటి మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, ఎంసీ విజయానందరెడ్డి, కట్టమంచిలో కార్పొరేటర్ హరిణీరెడ్డి, చుడా చైర్మన్ సి.పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో నిమజ్జన కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో అడిషనల్ ఎస్పీ ఆరీఫ్ ఉల్లా పర్యవేక్షణలో భద్రత చేపట్టారు.

పారిశుధ్యానికి పెద్దపీట

చిత్తూరు, మే 22: నగర కమిషనర్ అరుణ ఆదేశాల మేరకు జాతర సందర్భంగా నగరంలో పారిశుధ్య పనులకు పెద్దపీట వేశారు. నగరపాలక సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో ఎక్కడా పారిశుధ్య ఇబ్బందులు కలగలేదు. అమ్మవారిని ప్రతిష్ఠించిన చోట గంగాళంలో పోసే అంబలి వీధుల్లో పారేది. వారం రోజుల వరకు డ్రైనేజీల్లో దుర్వాసన వచ్చేది. గతానుభవాలను దృష్టిలో ఉంచుకుని పారిశుధ్య విభాగం సిబ్బంది వీధులను ఎప్పటికప్పుడు శుభ్రం చేశారు.


మంగసముద్రం, ఓబనపల్లె నడివీధి గంగమ్మలు


ఆండాళ్, పెరుమాళ్ వేషధారణలో చిన్నారులు


సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

నేడు పౌర్ణమి గిరి ప్రదక్షిణ

చిత్తూరు కల్చరల్, మే 22: గిరింపేట వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరాలయం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పౌర్ణమి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు ఈవో సుబ్బారెడ్డి తెలిపారు. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, పూలరథంపై ఊరేగించనున్నామని, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా గంగమ్మ నిమజ్జనం


గంగమ్మ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు

పూతలపట్టు, మే 22: మండల కేంద్రంలో బుధవారం గంగమ్మ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. రెండ్రోజులుగా జరిగిన గంగమ్మ జాతర ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజున మధ్యాహ్నం 3 గంటలకు అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి నీవానదిలో నిమజ్జనం చేశారు. యువకులు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ ఊరేగింపులో పాల్గొన్నారు. మహిళలు అమ్మవారికి హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా తపస్మాన్ ఉత్సవం


నిమ్మకాయల కోసం ఎగబడుతున్న భక్తులు

కార్వేటినగరం, మే 22: మండలంలోని కత్తెరపల్లె గ్రామంలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం తపస్మాన్ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అర్జున వేషధారి తపస్సు మాను ఎక్కి నిమ్మపండ్లు విసరడం, వాటిని దక్కించుకునేందుకు మహిళా భక్తులు పోటీ పడడం వంటి దృశ్యాలు కనువిందు చేశాయి. నిమ్మపండ్లు దక్కించుకున్న వారికి సంతాన ప్రాప్తి కలుగుతుందనే నమ్మకం ఉంది.

విశేషాలంకరణలో రేణుకమాత



కార్వేటినగరం, మే 22: రేణుకమాత కొలువు కార్యక్రమంలో భాగంగా కార్వేటినగరం గ్రామ పంచాయతీ సుద్దగుంటలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. భక్తులు కర్పూర హారతి నీరజనాలు అర్పించారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కొద్దిపాటి వర్షానికే రోడ్లన్నీ గుంతలమయం


గుంతలమయంగా మారిన నక్కలపాళ్యం, రెట్టగుంట రోడ్లు

గుడిపాల, మే 22: మండలంలోని పలు గ్రామాల్లో కొద్దిపాటి వర్షానికే రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. రెట్టగుంట, నక్కలపాళ్యం, చవటన్‌తంగాళ్, లెప్రసీకాలనీ తదితర గ్రామాల్లో ఏ మాత్రం ఏమారినా వాహన చోదకులు పడి గాయాలపాలవ్వాల్సిందే. రహదారులను మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇకనైనా దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నారు.

సహకరించిన వారికి రుణపడి ఉంటా

- పూతలపట్టు టీడీపీ అభ్యర్థి మురళీమోహన్


సమావేశంలో మాట్లాడుతున్న మురళీమోహన్

పూతలపట్టు, మే 22: ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని టీడీపీ పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. చిత్తూరులోని ఒక హోటల్లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజున తమకంటే నాయకులు, కార్యకర్తలు, మిత్రులు ఎక్కువగా కష్టపడ్డారని తెలిపారు. జూన్ 4వ తేదీ కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ముగిసేవరకు ఏజెంట్లు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. సమా వేశంలో ఎన్‌పీ జయప్రకాష్, దొరబాబు చౌదరి, గిరిధర్ బాబు, గాలి దిలీప్‌కుమార్, మొరార్జీ యాదవ్ పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సప్తగిరి ప్రసాద్

చిత్తూరు సిటీ, మే 22: రైతులకు సకాలంలో నాణ్యమైన వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ కోరారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు విత్తనాలు అందించాలన్నారు. బ్లాక్‌లో విక్రయించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంతర పంటలైన కందులు, ఉద్దులు వంటి విత్తనాలు, ఎరువులు ఉచితంగా ఇవ్వాలని కోరారు. పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్, పార్టీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం



వెదురుకుప్పం, మే 22: మండలంలోని చిన్నమరెడ్డికండ్రిగ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పూజా కార్యక్రమాలు చేశారు. ఉత్సవ విగ్రహం, దేవర ఎద్దు ఊరేగింపు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకుని, తరించారు. ఆలయ ధర్మకర్త మిట్టపల్లి మంజుల, ప్రధాన కార్యనిర్వాహకులు మిట్టపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇసుక అక్రమ రవాణా కట్టడిపై దృష్టి పెట్టాలి

వెదురుకుప్పం, మే 22: పాలసముద్రం మండలం నుంచి తమిళనాడుకు వెళుతున్న ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జనసేన పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న కోరారు. అధికార పార్టీకి చెందిన వారు ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రెవెన్యూ, పోలీసు శాఖ స్పందించి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే మండల పరిధిలోని సహజ వనరులు పూర్తిగా దోపిడీకి గురయ్యే ప్రమాదముందని పేర్కొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన దగ్గుమళ్ల



చిత్తూరు సిటీ, మే 22: చిత్తూరు పార్లమెంటు కూటమి ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. బుధవారం నగర సమీపంలోని ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరచిన ఈవీఎంలను సీసీటీవీల ద్వారా పరిశీలించారు. భద్రత, పోలీసుల నిఘా వంటి అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ ఆయన వెంట ఉన్నారు.

సచివాలయ భవన నిర్మాణం పూర్తి చేయరా?



కార్వేటినగరం, మే 22: కార్వేటినగరం మేజర్ పంచాయితీలోని అటవీశాఖ కార్యాలయం పక్కన ప్రభుత్వ 1వ సచివాలయ భవన నిర్మాణం అసంపూర్తిగా ఉంది. రెండేళ్లుగా ఈ భవన నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదు. త్వరగా పూర్తి చేసి అందుబాటులో తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

హంస వాహనంపై మృత్యుంజయేశ్వరుడి ఊరేగింపు



చౌడేపల్లె, మే22: స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుం జయేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో 10వ రోజు హంస వాహనంపై ఆది దంపతులు ఊరే గారు. బుధవారం ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు రాజశేఖర్ దీక్షితులు, కుమార, మహేష్ దీక్షితులు పంచా మృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. పూలతో, ప్రభల తో, విద్యుత్ దీపాలతో అలంకరించిన అశ్వ వాహనంపై రాత్రి ఉత్సవ మూర్తులను అధిష్ఠింపచేశారు. తర్వాత మంగళ వాయి ద్యాల, చెక్క భజనలు, కోలాటాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు కర్పూర హారతులు సమర్పిం చారు. ఉభయదారులుగా బ్రాహ్మణ సంఘం సభ్యులు వ్యవహరించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో చోరీ

బైరెడ్డిపల్లె, మే 22 : మండలంలోని తీర్థం గ్రామసమీపంలో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఆచారి బుధవారం బైరెడ్డిపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన కథనం మేరకు.. ఆలయ ధర్మకర్త మంగళవారం రాత్రి ఆలయానికి తాళాలు వేసి వెళ్లారు. ఉదయం పూజ చేయడానికి రాగా ఆలయం ముందు గేటుకు వేసివున్న తాళం పగిలిపోయి ఉంది. లోనికెళ్లి చూడగా గర్భగుడిలో గోవిందమ్మ మూలవిరాట్‌కు అలంకరించి ఉండిన 12 గ్రాముల బంగారు మంగళసూత్రాలు కనిపించలేదు. అలాగే రెండు కంచు దీపస్తంభాలు, పెద్ద స్టీల్ హుండీ, నగదు, వస్తువులు చోరీకి గురయ్యాయి.